## క్లుప్తంగా

### నేటి నుంచి భవానీలు, స్వాములకు భిక్షలు ప్రారంభం

అంబాజీపేట: మాచవరం శివాలయానికి వెళ్లే రహదారిలో డీకే గార్డెన్స్‌లో వరసిద్ధి వినాయక ఆలయం వద్ద అంబాజీపేట భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నుంచి భవానీలకు, స్వాములకు భిక్షలు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భిక్షలు పెడతారన్నారు. ఈ భిక్షలు నవరాత్రుల తొమ్మిది రోజులు పెట్టనున్నామన్నారు.

### బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం



కరవాకలో సన్మానం అందుకున్న బదిలీ అయిన ఉపాధ్యాయులు

మామిడికుదురు: కరవాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసిన పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులతో పాటు సాధారణంగా బదిలీ అయిన ఉద్యోగులను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. వినాయకరావు, పి.సత్యసాయిబాబు, మహ్మద్ సజ్జాద్ హుస్సేన్, కల్పే ఆబేద్ మాజింద్రాణీలను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బదిలీ అయిన ఉపాధ్యాయులు అందించిన సేవలను ప్రతి ఒక్కరూ కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, స్థలదాత రాపాక నరసింహస్వామి, సిర్రా శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ మందేశ్వరరరావు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.25,002 విరాళం



దాత రామారావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన వుయ్యూరి రామారావు రూ.25,002 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో జాయిన్ అయ్యేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్టు ప్రిన్సిపాల్ కె.జ్యోతి ఆదివారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే కార్యాలయంలో సర్టిఫికెట్లతో సంప్రదించాలన్నారు. బీఏ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయన్నారు. ఈ స్పాట్లో జాయిన్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ప్రోత్సాహక, సంక్షేమ పథకాలు వర్తించవన్నారు. మరిన్ని వివరాలకు 7995875308 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రావులపాలెం: దసరా పండగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను కోనసీమ జిల్లాలో పదిరోజుల పాటు ప్రచారం చేస్తున్నట్టు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం రావులపాలెంలోని పలు ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. దశ అంటే పది అని, 'ర' అంటే నశింపజేయడం అని అర్థం, ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే మొత్తం పది ఇంద్రియాలను జయించడమే దసరా పండగ అర్థం అని అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యులు శాంతరాజు, గోవింద్, లక్ష్మీనారాయణ, భరత్, సత్య, రాణి, శాంతి, దేవి పాల్గొన్నారు.

### సీసీ రోడ్డుకు భూమిపూజ

మామిడికుదురు: అప్పనపల్లి మందపాటివారిపేటలో రూ.రెండు లక్షలతో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ ఆదివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల జనార్దన్, పార్టీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, నాగరాజు, గెద్దం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సురక్షతో కంటి సమస్యలకు పరిష్కారం

- కళ్ల సమస్యతో వస్తున్న వారే అధికం
- కళ్లజోళ్ల పంపిణీకి కార్యాచరణ



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు భారీగా వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సురక్ష శిబిరాలు క్షణం తీరిక లేకుండా ఏకబిగిన సాగుతున్నాయి. ఒక్కో శిబిరానికి ఆ గ్రామ విస్తీర్ణాన్ని బట్టి 250 నుంచి 300 మంది పైబడి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారు. ఈ శిబిరాలకు వస్తున్న వారిలో కంటి సమస్యతో ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. 50 శాతానికి పైగా కంటి సమస్యతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. మిగిలిన విభాగాల కన్న ఎక్కువ సంఖ్యలో ఆప్తాల్మిక్ సమస్యతో వస్తున్న వారే కనిపిస్తున్నారు. కంటి చూపు మందగించడం, కంటి శుక్లాలు, నీరు కారడం, తలనొప్పి వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ తరహా సమస్యలతో వస్తున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష భరోసా కల్పిస్తోంది. కంటి సమస్యల్లో 50 శాతం సమస్యలు మెడిసిన్ ద్వారా పరిష్కారమవుతున్నాయి. మిగిలిన వాటిని క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం రిఫర్ చేస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజక వర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఇంత వరకు 121 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు.

### 22,122 మందికి పరీక్షలు చేశాం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంత వరకు 22,122 మందికి కంటి పరీక్షలు నిర్వహించాం. వారిలో 6529 మందికి సాధారణ కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. అవి మెడిసిన్‌తో తగ్గిపోతాయి. 14,410 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించాం. 1183 మందిని ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేశాం. 1034 మందికి క్యాటరాక్ట్ సమస్య ఉన్నట్లు గుర్తించాం. వారికి అమలాపురం ప్రభుత్వాస్పత్రి లేదా కిమ్స్‌లో శస్త్ర చికిత్స చేయిస్తాం.

– ఆలపాటి హేమలత, ఆప్తాలమిక్ నోడల్ అధికారి, కోనసీమ జిల్లా

### కంటి పరీక్ష చేయించుకున్నాను



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్ష చేయించుకున్నాను. తలనొప్పి సమస్యతో ఇబ్బంది పడుతున్నాను. దీనికి పరీక్ష చేసిన డాక్టర్ కళ్లజోడు అవసరమవుతుందని చెప్పారు. నా రిపోర్టు పరిశీలించి దానికి అనుగుణంగా కళ్లజోడు ఇస్తామన్నారు. సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎక్కువ మంది ఈ శిబిరానికి వచ్చి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను పొందుతున్నారు. – కొమ్ముల భవాని, పెదపట్నంలంక

### 11 క్యాంపులు జరిగాయి



కంటి సమస్యలకు సంబంధించిన వారు ఎక్కువ మంది వస్తున్నారు. మామిడికుదురు మండల పరిధిలో ఇంత వరకు 11 క్యాంపులు జరిగాయి. సుమారు రెండు వేల మందికి పరీక్షలు చేశాం. కొంత మందికి మందులతో సమస్య పరిష్కారమవుతుంది. అవసరమైన వారికి కళజోళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. క్రిటికల్ కేసులను అమలాపురం కిమ్స్ లేదా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నాం. – ముజఫర్ హుస్సేన్, ఆప్తాలమిక్ అధికారి, నగరం

## సంక్షేమాన్ని వివరిస్తూ... సమస్యలు పరిష్కరిస్తూ..



ఈతకోటలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రతి గడపకూ వెళ్లి వారి ఇంట్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు ఉంటే చెప్పాలని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఈతకోట సచివాలయం-2 పరిధిలోని గౌడ రామాలయం నుంచి నెక్కంటి కాలనీ, ఎస్సీ ఏరియా తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల్లో చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేశారన్నారు. సంక్షేమ పథకాలతో పాటూ అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఇంకా రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, గతంలోలా కమీషన్లు, లంచాలు అవసరం లేకుండానే అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పని జరగాలంటే మండల స్థాయిలోని కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి నుంచి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజల ఇంటి వద్దకే పాలనను అందిస్తున్నామన్నారు. ప్రజారోగ్యం, విద్యా రంగాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వంలో చేయని విధంగా పరిపాలన చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వి.సుబ్బరాజు, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, వత్సవాయి బాబీరాజు, చింతారావు, వైవీ, యర్రంశెట్టి కాశీకృష్ణ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు



ఇసుకపూడిలో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే రహదారుల నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇసుకపూడి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 99 శాతం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, కోట విజయరాజు, మట్టపర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో కిడ్నీ వ్యాధితో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కత్తుల నాగరాజు పరిస్థితిని ఎమ్మెల్యే చిట్టిబాబు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో రూ.2 లక్షల మంజూరైన చెక్కును నాగరాజుకు అందజేశారు.

## అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందడం గర్వకారణం



సఖినేటిపల్లిలో ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక, సర్పంచ్ చిట్టిబాబు

సఖినేటిపల్లి: సాహిత్యపరంగా అంతర్జాతీయ స్థాయిలో కోనసీమలోని వీవీ మెరకకు చెందిన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గుర్తింపు పొందడం గర్వకారణమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక శాంతినగర్ సంఘ ఆధ్వర్యంలో ఇటీవల డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం అందుకున్న ప్రతాప్ దంపతులను ఎమ్మెల్యే రాపాక, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు గజమాలతో సత్కరించారు. అనంతరం సర్పంచ్ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజోలు ప్రాంత వాసిగా ప్రతాప్ ప్రపంచ రికార్డుల్లో సాహిత్య పరంగా చోటుచేసుకోవడం ప్రశంశనీయమని అన్నారు. సంఘ సభ్యులు విజయానంద్, చిన్నిబాబు, తాతాజీ, వేణు, మూర్తి, రెడ్డి, డేవిడ్, గ్రామ శాఖ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం పాల్గొన్నారు.

## వెంకటేశ్వరరావుకు ప్రశంసాపత్రం



వెంకటేశ్వరరావు ప్రశంసాపత్రం గెలుచుకున్న చిత్రం



ముషిణి వెంకటేశ్వరరావు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి పెదపాలేనికి చెందిన ప్రముఖ ఛాయా చిత్రగ్రాహకుడు ముషిణి వెంకటేశ్వరరావుకు హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమి ఇటీవల ‹ఏరువాక› థీమ్‌పై నిర్వహించిన త్రైమాసిక ఫొటో కాంపిటీషన్‌లో ప్రశంసాపత్రం లభించినట్లు తెలిపారు. ఆయన పోస్టల్ డిపార్ట్‌మెంట్ సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్నారు. 2015లో బీహార్‌లోని పాట్నాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ సంస్థ అసోసియేట్‌షిప్ ప్రదానం చేసింది. 2016లో అమెరికాకు చెందిన ఐసీఎస్ (ఇమేజ్ కొలీగ్ సొసైటీ) ఏఐసీఎస్ అవార్డును అందుకున్నారు. 2019లో న్యూఢిల్లీకి చెందిన ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ నుంచి ఏబీఐపీసీని సాధించారు. వెంకటేశ్వరరావు తీసిన 417 కలర్, బ్లాక్ అండ్ వైట్ చిత్రాలు న్యూఢిల్లీ, ముంబై కోల్‌కతా, జోధపూర్ ప్రాంతాల్లో ప్రదర్శనకు నోచుకున్నాయి. ఇప్పటి వరకూ వెంకటేశ్వరరావు మూడు గోల్డ్ మెడల్స్, 24 జాతీయ అవార్డులు, 40 ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

## పెన్షనర్ల సంఘ కార్యవర్గంలో ఖాళీల భర్తీ

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కొత్తపేట తాలూకా యూనిట్ కార్యవర్గంలో ఖాళీలను భర్తీ చేసినట్టు సంఘ ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సంఘ అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యవర్గంలో ఒక ఉపాధ్యక్ష పదవి, 4 కార్యదర్శి పదవులు ఖాళీగా ఉండగా వాటిని భర్తీ చేసే అంశంపై చర్చించారు. సంఘంలో పనిచేయడానికి ఆసక్తి చూపిన సభ్యులను నూతన సభ్యులుగా నియమించారు. వారిలో ఉపాధ్యక్షుడిగా జీవీఎల్ నరసింహం, ఉప కార్యదర్శులుగా జంగా ప్రకాశం, గుబ్బల బాబూరావు, మాకే నాగభూషణం, కలిదిండి సత్యనారాయణరాజులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సేవలో శక్తివంచన లేకుండా పాల్గొంటూ సంఘ అభివృద్ధికి పాటుపడతామని అన్నారు. అనంతరం వారిని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సత్తిరాజు, సుబ్బారావు పూలమాలలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కమిటీ సభ్యులు



రజత కవచాలంకృత దుర్గాదేవిగా బి.సావరం విజయ కనకదుర్గాదేవి



ఈతకోటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



అప్పనపల్లి బాలాజీ ఆలయంలో పద్మావతి దేవి సన్నిధిలో పూజలు

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి శుభ ముహూర్తాన అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలోని పద్మావతి దేవి సన్నిధిలో శరన్నవరాత్ర వేడుకలకు కలశ స్థాపన జరిగింది. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో శత చండీ యాగ సహిత శరన్నవరాత్ర ఉత్సవాలకు కలశ స్థాపన చేశారు. ఈ ఆలయంలో అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయ దుర్గమ్మను చామంతి పూలతో విశేషంగా అలంకరించారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన మహోత్సవాలకు కలశ స్థాపన జరిగింది. పలు గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

**ఈతకోటలో..**

రావులపాలెం: దేవి శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా రావులపాలెం మండలం ఈతకోటలో వేంచేసియున్న విజయదుర్గా దేవి అమ్మవారిని, గ్రామ దేవత ఎర్రమ్మ అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు నియోజకవర్గంలో ప్రజాలందరిపైన ఉండాలని ఆకాంక్షించారు.

**కొత్తపేటలో..**

కొత్తపేట: స్థానిక బొరుసువారిసావరం విజయకనక దుర్గాదేవి ఆలయంలో ఆలయ నిర్మాణకర్త బొరుసు వెంకటఉదయభాస్కర్-వసుధ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు అమ్మవారిని రజత కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదే ప్రాంగణంలో ప్రత్యేకంగా ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వాడపాలెం జ్ఞానసరస్వతీదేవి, అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. స్థానిక గ్రామదేవత బంగారమ్మ అమ్మవారి ఆలయంలో, బోడిపాలెం విజయ దుర్గ అమ్మవారి ఆలయం, దేవీ సెంటర్ తదితర ఆలయాల ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

**వైభవంగా భేతాళ స్వామి కలశ స్థాపన**

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజయ భేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా స్వామి వారి కలశస్థాపన నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. ప్రదర్శనలో చెడీ తాలింఖానా, తీన్‌మార్ డాన్స్‌లతో భేతాళస్వామిని ఊరేగించి పెద్ద వీధిలోని బేతాళ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించారు.

**పి.గన్నవరంలో..**

పి.గన్నవరం: మండలంలో దేవీ నవరాత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారి ఆలయంలో దేవీ నవరాత్ర మహోత్సవాల సందర్భంగా సహస్రనామ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. అలాగే పి.గన్నవరంలోని లక్ష్మీకనకదుర్గమ్మ వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.

**సఖినేటిపల్లిలో..**

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంవలో కొలువైన లక్ష్మీనృసింహుని సోదరి గుర్రాలక్క అమ్మవారి సన్నిధిలో ఆదివారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీనృసింహుని దేవస్థానం తరఫున అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైర నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆలమూరులో..**

ఆలమూరు: నవరాత్రి తొలిరోజు దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంధిపూడిలోని విజయ దుర్గాదేవి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**ఆత్రేయపురంలో..**

ఆత్రేయపురం: మండలంలోని దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలు, మందిరాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవి బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

**అయినవిల్లిలో..**

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణదేవి అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. లలితసహస్ర పారాయణ చేశారు.



తాటికాయల వారిపాలెంలో బాలత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



సంధిపూడిలో దుర్గామాతను నోట్లతో అలంకరించిన దృశ్యం



ఉచ్చిలిలో బాలత్రిపుర సుందరి దేవిగా విజయదుర్గమ్మ

### రామ్ విలాస్ పాశ్వాన్ విలక్షణ నాయకుడు



పాశ్వాన్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రామ్ విలాస్ పాశ్వాన్ విలక్షణమైన గొప్ప నాయకుడని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద డాక్టర్ పొలమూరి విక్రమ్ రచించిన రామ్ విలాస్ పాశ్వాన్ పుస్తకాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ఆవిష్కరించారు. పుస్తక రచయిత విక్రమ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు అధ్యక్షతన ఉపన్యాసం చేస్తూ అంబేడ్కర్‌కు నోబెల్ బహుమతి ఇవ్వాలన్న పాశ్వాన్ డిమాండ్‌ను అమలు చేయాలన్నారు. అభ్యుదయ భీమ్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాకారుడు మంగం సత్యనారాయణ, నక్కా త్రిలోచనరావు, రొక్కాల వెంకట్రావు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆదివారం రావులపాలెం మండలం ఈతకోట గ్రామం నుంచి మాజీ వార్డ్ మెంబర్ మానే చంద్రరావు, నాగభూషణం దంపతులు, వారి కుమారులు హరి, రామకోటి వారితో పాటూ మానే శివయ్య, మానే వెంకన్న , రేలంగి సత్యనారాయణలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

### ఆదర్శ ఆంధ్రా యూత్ సేవలు అభినందనీయం

మలికిపురం: కువైట్ కేంద్రంగా ఆదర్శ ఆంధ్రా యూత్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం గూడపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లమందల మేరీ కుమారికి, ఆదర్శ ఆంధ్రా యూత్ పంపిన రూ.10 వేల నగదును ఆయన అందజేశారు. ఈ మొత్తాన్ని యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోకా స్వామి, ఇంజేటి కృష్ణకుమార్, అధ్యక్షుడు ఇంజేటి శ్యామ్‌లు సమకూర్చారు. కాగా స్థానిక సర్పంచ్ ఎన్‌వీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అన్నపూర్ణ సమకూర్చిన చెరో రూ.వెయ్యి చొప్పున నగదును కూడా మేరీ కుమారికి ఎమ్మెల్యే అందజేశారు.

### జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

అంబాజీపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జిల్లా అధ్యక్షుడు కనపాల బాబూరావు అన్నారు. మాచవరం శివారు పోతాయిలంకలో మన్నా చర్చిలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా, మండల నాయకులతో జిల్లా జనరల్ సెక్రటరీ నేలపూడి రాజు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైతే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం బాబురావును ఘనంగా సన్మానించారు. ఎల్.సీమోనురాజు, పి.రాజు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

### కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా 'చెంపాటి'

సఖినేటిపల్లి: బీజేపీ కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని వీవీ మెరకకు చెందిన ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజును నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి నుంచి నియామక పత్రాలు అందినట్టు ఆదివారం మీడియాకు తెలిపారు. నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి, ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### పోలీసులకు సమాచారం అందించండి

ఆలమూరు: వివిధ గ్రామాల్లోని ప్రజానీకం గ్రామాంతరం వెళితే సత్వరమే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై ఎల్.శ్రీనివాస నాయక్ కోరారు. ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల దృష్ట్యా అనేక మంది కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఎటువంటి నష్టనివారణ చర్యలు జరగ్గ కూడదనే ఉద్దేశంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

### బహుజన మేళా సభలు ప్రారంభం

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని, సిద్ధాంతాలను అనుసరించడం వల్లే బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ గొప్ప విజయాలను సాధించారని బహుజన రచయితల వేదిక (బరమే) వ్యవస్థాపక కన్వీనర్ నూకతోటి రవికుమార్ అన్నారు. పి.గన్నవరంలో మూడురోజుల పాటు జరగనున్న బహుజన మేళా సభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బరమే రచయిత కూరాటి భీమశంకర్ అధ్యక్షతన జరిగిన సభలో రవికుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బహుజన సంస్థలకు గొంతును ఇచ్చింది అంబేడ్కర్ రాజ్యాంగమేనని అన్నారు. బహుజన రాజకీయ ఉద్యమానికి బరమే తనవంతు సహకారం అందిస్తుందని ఆయన అన్నారు. సమావేశంలో కోనసీమ జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు, పి.గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు తాడి రాంబాబు, ప్రధాన కార్యదర్శి ములపర్తి చందు, నాయకులు దాకే విద్యాసాగర్, లెనిన్, నెల్లి బాలు, కుసుమ శివశంకర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.